# ఆపత్కాలంలో అండగా పోలీసులు

- నిర్మల్ జిల్లాలో డయల్ 100కు విశేష స్పందన
- ఏడు నెలల్లో 12,001 ఫిర్యాదులు.. 10 మంది ప్రాణాలు కాపాడిన పోలీసులు
- సగటున 6 నిమిషాల్లో ఘటనా స్థలికి పోలీసులు
- ప్రాథమిక దశలోనే సమస్యలు పరిష్కారం.. జిల్లాలో తగ్గుతున్న నేరాలు


డయల్ 100 ద్వారా బాధితులను కాపాడిన పోలీసులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు సేవలు అందిస్తూ ఆపత్కాలంలో అండగా నిలుస్తూ అందరితో శభాష్ అపించుకుంటున్నారు నిర్మల్ జిల్లా పోలీసులు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జానకి షర్మిల ఆరు నెలలలోనే సమస్యాత్మకంగా పేరున్న నిర్మల్ జిల్లాను శాంతిభద్రతల్లో ముందుంచారు. శాంతిభద్రతలు అదుపులో ఉంచేందుకు, ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ పోలీసు సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహనను విస్తృతం చేస్తున్నారు. సహాయం కోసం డయల్ 100కు సమాచారం అందించిన బాధితుల వద్దకు పోలీసులు నిమిషాల్లోనే చేరుకునేలా పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల అత్యంత ప్రమాదంలో డయల్ 100కు సమాచారం ఇచ్చిన 10 మందిని నిర్మల్ పోలీసులు ప్రాణాల నుంచి రక్షించారు. నేరాలను, సంఘ విద్రోహ చర్యలను డయల్ 100 ద్వారా సేకరించి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి నేరాల తగ్గుముఖానికి కృషి చేస్తున్నారు.

ఇటీవల హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్తున్న రాధాకృష్ణ దంపతులు, కుమారుడు రాత్రి రెండు గంటల సమయంలో వర్షం కురుస్తూ రోడ్డు సరిగ్గా కనబడక సారంగాపూర్ మహబూబ్ ఘాట్‌కు చేరుకోగానే కారు అదుపుతప్పి లోయలో పడిపోయింది. దాదాపు 150 అడుగుల లోయలోకి కారు వెళ్లగా బాధితులు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ గోపినాథ్, పోలీస్ సిబ్బంది లోకేషన్ ఆధారంగా అర్ధరాత్రి అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు.

✦ జూలై 27వ తేదీన రాత్రి 8:40 గంటలకు డయల్ 100కు కాల్ వచ్చింది. దస్తూరాబాద్ మండలానికి చెందిన గుండా శ్రీనివాస్ అటవీ ప్రాంతంలో గొర్లను మేపడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులు అర్ధరాత్రి వరకు గాలించగా ఉదయం 4.30 గంటలకు తప్పిపోయిన శ్రీనివాస్‌ను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

✦ నిర్మల్‌లోని విశ్వనాథ్ పేట్ కాలనీకి చెందిన సయ్యద్ ముజీబ్ కుటుంబ కలహాల వల్ల గడ్డెన్న వాగు వద్ద ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు సమాచారం అందించాడు. నిమిషాల్లో అక్కడికి చేరుకుని ఆత్మహత్య చేసుకుంటున్న ముజీబ్ ప్రాణాలను కాపాడి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

✦ నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వృద్ధురాలు ఇంటి నుంచి తప్పించుకుని పోయింది. డయల్ 100కు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకుని వృద్ధురాలి వివరాలు కనుక్కొని రెండు గంటల్లోనే కుటుంబీకులకు అప్పగించారు.

✦ నిర్మల్‌లోని ఓ పాన్ దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నారని ఓ వ్యక్తి డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు దుకాణంలోని గంజాయిని స్వాధీనం చేసుకుని దుకాణాన్ని తొలగించారు.

✦ నిర్మల్ రూరల్ మండలంలోని ఓ శివారు ప్రాంతంలో పేకాటాడుతున్నట్లు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పేకాట స్థావరంపై దాడి చేసి కేసు నమోదు చేశారు.

పై ఘటనల్లో బాధితులందరూ సకాలంలో డయల్ 100ను సద్వినియోగం చేసుకుని సమస్యను పరిష్కరించుకున్నారు. మీ చుట్టు పక్కల ఇలాంటి ఘటనలతో పాటు మరే ఇతర ఇబ్బందికర సంఘటనలు ఎదురైనా వెంటనే డయల్ 100కు గాని జిల్లా పోలీస్ వాట్సాప్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

### ఎనిమిది నెలల్లో 12,001 ఫిర్యాదులు..

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లోని పోలీస్ స్టేషన్‌లో జనవరి 1 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు 12,001 మంది ప్రజలు డయల్ 100ను సద్వినియోగం చేసుకున్నారు.ఈ ఫిర్యాదుల్లో 100 శాతం అక్కడికక్కడే పోలీసులు పరిష్కరించారు. ఎస్పీ జానకి షర్మిల సమస్యను పరిష్కరిస్తుండడంతో ప్రజలకు విశ్వాసం పెరిగింది.

### గోప్యంగా ఫిర్యాదుదారుల వివరాలు..

ఆపత్కాలంలో తమను రక్షించుకునేందుకే కాకుండా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సామాజిక బాధ్యత వహిస్తూ సాధారణ ప్రజలు సైతం డయల్ 100కు సమాచారం అందించవచ్చు. మీ చుట్టూ ఉన్న ప్రదేశాల్లో సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయన్నా, పేకాట, గుట్కా, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై సైతం డయల్ 100కు సమాచారం అందించవచ్చు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలు పోలీసులు గోప్యంగా ఉంచుతారు.

### డయల్ 100కు ప్రత్యేక టీం



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఆపత్కాలంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతే ప్రజలు డయల్ 100 సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ఫిర్యాదులనైనా ప్రజలు నిర్భయంగా పరిష్కరించుకోవచ్చు. డయల్ 100 వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిర్మల్ జిల్లాలో డయల్ 100 కాల్స్ పర్యవేక్షణపై ఎస్ఐ స్థాయి అధికారితో పాటు 10 మంది పోలీసులను నియమించాం. వీరితో పాటు జిల్లా పెట్రోకార్ పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది నిమిషాల్లోనే ఘటనా స్థలికి చేరుకుని బాధితులకు అండగా ఉంటారు. డయల్ 100కు వచ్చే అనవసరమైన కాల్స్‌పై చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

## రైతులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదు

బేల, ఆగస్టు 19 : పంట రుణమాఫీ కాలేదని జిల్లా రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి అన్నారు. సోమవారం బేలలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని అందులో భాగంగానే తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన రైతులు రుణమాఫీ కాలేదని నిరసన కార్యక్రమాలు చేపడితే 11 మందిపైన పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. జిల్లాలో 13 యాక్ట్ అమలులో ఉందని కేసులు పెట్టిన పోలీసులు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావ్ దిష్టిబొమ్మలు దహనం చేసినప్పుడు కంది శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి రూ.2లక్షల రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో వేయాలని అలాగే రైతులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామగ్రామాల్లో రుణమాఫీ కానీ రైతులందరూ జేఏసీగా ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, దేవన్న, సతీశ్, తేజ్‌రావ్ మాస్కే, బత్తుల సుదర్శన్, మంగేశ్ ఠాక్రే, సదీక్, రైతులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, ఆగస్టు 19 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఇస్లాంనగర్ కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, జ్వర బాధితులు 43 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి జ్వర బాధితుల సర్వే నిర్వహించి జ్వర బాధితుల రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఉత్తమ్‌సింగ్, రాథోడ్ కైలాస్, హెల్త్ అసిస్టెంట్ సుభాష్, రాజ్ కిరణ్ రెడ్డి, ఏఎన్ఎం పద్మ, సుభాష్ పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్, ఆగస్టు 19 : బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బజార్‌హత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మండల కేంద్రంలోని బ్యాంకు ఆవరణలో మహిళలు, ఖాతాదారులతో సమావేశమై బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. అంతకుముందు బ్యాంకు మేనేజర్‌కు, సిబ్బంది మహిళలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పారావు, నాయకులు పాండురంగ్, మైబుబ్, ఐకేపీ సిబ్బంది, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రుణమాఫీపై తహసీల్దార్‌కు వినతి

బోథ్, ఆగస్టు 19 : ప్రతి రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని కోరుతూ మంగళవారం బోథ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు రైతులు ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కాని రైతులంతా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

## బోథ్ దవాఖానకు వాటర్ ఫ్రీజర్ అందజేత

బోథ్, ఆగస్టు 19 : బోథ్‌లో తాలూకా ప్రధాన దవాఖానకు సోమవారం మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ తరపున మినరల్ వాటర్ ఫ్రీజర్‌ను అందజేశారు. మాసం లక్ష్మి 16వ వర్ధంతి పురస్కరించుకొని సొసైటీ చైర్మన్ అనిల్ కుమార్ ఫ్రీజర్‌ను సమకూర్చారు. ఫ్రీజర్‌ను దవాఖాన సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాలిక్ రమేశ్, వేములు కిష్టయ్య, సతీశ్, శేఖర్, వినిల్, సాయికుమార్ పాల్గొన్నారు.

## నేడు రైతులతో సమావేశం

తలమడుగు, ఆగస్టు 19 : సుంకిడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాల మేరకు మంగవారం ఉదయం 11 గంటలకు రుణమాఫీ కాని రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


నిర్మల్‌అర్బన్ : ఫిర్యాదులను సమర్పిస్తున్న అర్జీదారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి హాజరై ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చి తమ ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ఫిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ అర్జీలు ఉండకుండా చూసుకోవాలి

ఎదులాపురం, ఆగస్టు 19 : ప్రజలు సమస్యలపై ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలు తెలియజేస్తూ వినతులు ఇచ్చారు. కొన్ని సమస్యలపై అప్పటికప్పుడు అందుబాటులో లేని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ , అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గురుకులంలో విద్యార్థుల రాఖీ ప్రదర్శన


బ్రో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

తాంసి, ఆగస్టు 19 : మండలంలోని అన్ని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్ తన నివాసంలో వేడుకలు జరుపుకున్నారు. బండల్‌నాగపూర్ గ్రామంలో ఈదుల్లా సావర్గాం గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకున్నారు. అనంతరం బ్రో రాఖీ ఆకృతిలో కూర్చున్నారు. ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నది. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ రేఖ రఘు, నాయకులు మహేందర్, అశోక్, ఆనంద్, రామన్న, గంగన్న పాల్గొన్నారు.

## రామగిరి మహారాజ్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఎదులాపురం, ఆగస్టు 19 : మహారాష్ట్రలోని జల్గాంకు చెందిన రామగిరి మహారాజ్‌పై ఆదిలాబాద్‌కు చెందిన మజ్లిస్ తహఫ్పూజ్ ఖత్మే నబూవత్ నేతలు సోమవారం డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రవక్త మహ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై రామగిరి మహారాజ్ అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రపంచ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేశారని ఆ సంస్థ నాయకులు ముఫ్తీ సర్దార్ ఖాస్మి పేర్కొన్నారు. పరస్పర సోదర భావంతో మెలుగుతున్న సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యాఖ్యానించిన రామగిరి మహారాజ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉరి వేసుకుని ఒకరి మృతి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : ఉరి వేసుకుని ఒకరి మృతి చెందిన ఘటన నిర్మల్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నిర్మల్‌కు చెందిన బాసగుట్ట రాజు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. గతంలో భార్య మరణిచడంతో మద్యానికి అలవాటు పడిన ఆయన జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : నిర్మల్‌లోని గాజుల్‌పేట్ కాలనీలో రవి అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. విశ్వనాథ్‌పేట్ కాలనీలోని తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఆదివారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబీకులు తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి తులం బంగారం, 15 తులాల వెండి, రూ. 6 వేల నగదును ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం, ఆగస్టు 19: కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక డిమాండ్ చేశారు. సోమవారం కుమ్రం భీం భవన్‌లో ప్రగతిశీల మహిళా సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యులు ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్న కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ముందుగా డాక్టర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు కుమ్ర అశోక్ పాల్గొన్నారు.

## వాగులో పడి ఎద్దు మృతి

సారంగాపూర్, ఆగస్టు 19: దుప్యాతండా గ్రామానికి చెందిన రాథోడ్ రంజిత్‌కుమార్ రైతు ఎద్దు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందింది. ఎప్పటిలాగే గ్రామ శివారులో మేత మేయడానికి వెళ్లగా కురుస్తున్న వర్షానికి వాగులోకి నీరు చేరడంతో ప్రమాదవశాత్తు జారీ పడి నీటిలో మునిగి మృతి చెందినట్లు రైతు తెలిపాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ. రూ. 50వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరుతున్నాడు.

# ప్రేమానుబంధాలకు ప్రతీక రక్షాబంధన్


ఎదులాపురం: ఆదిలాబాద్ కలెక్టర్‌కు రాఖీ కడుతున్న రేవతి బహెన్


ఎదులాపురం: ఏఎస్పీకి రాఖీ కుడుతున్న ఏఎస్ఐ


నేరడిగొండ: ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు


భైంసా: మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న డాక్టర్ చైతన్య కొమ్రేవార్


భైంసా: ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు రాఖీ కడుతున్న సోదరి


ఉట్నూర్‌రూరల్: ధరణి రాజేశ్‌కు రాఖీ కడుతున్న సోదరి

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా సోమవారం రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీ కట్టారు. మిఠాయిలు తినిపించారు. రాజకీయ నాయకులు, అధికారులకు రాఖీలు కట్టారు.

బోథ్, ఆగస్టు 19 : బోథ్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్, వేదం పాఠశాలల విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి రాఖీ కట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్, పోస్టాఫీస్, ఆరోగ్య, ఆర్టీసీ సిబ్బందికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ గౌడ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బోథ్ ఖండ కార్యవాహ ఎర్రోళ్ల సతీశ్, బౌద్ధిక్ ప్రముఖ్ హరి, వేదం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎదులాపురం, ఆగస్టు 19 : ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షాతో పాటు అధికారులకు ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ బహెనీలు, పోలీసు కార్యాలయంలో మహిళ పోలీసు సిబ్బంది అధికారులకు రాఖీలు కట్టారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా పాత హౌసింగ్ బోర్డ్‌లోని ఎంపీ నివాసానికి వచ్చి నగేశ్‌కు రాఖీ కట్టారు.

భైంసా, ఆగస్టు 19 : భైంసాలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు తన సోదరి, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌కు తన సోదరి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు డాక్టర్ చైతన్య కొమ్రేవార్ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.


ఎదులాపురం: ఎంపీకి రాఖీ కడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మనీషా

ముథోల్, ఆగస్టు, 19: ముథోల్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యపీఠం జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్, పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, సహకార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రోళ్ల రమేశ్, ప్రధానాచార్యులు సారథి రాజు పాల్గొన్నారు.

నేరడిగొండ, ఆగస్టు 19 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు నేరడిగొండలోని నివాసంలో ఆయన సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, ఆగస్టు 19: కుంటాల తహసీల్ కార్యాలయంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలానికి చెందిన దాసరి శైలజ, ఎంపల్లి ముత్తవ్వ, అయిటి రాజశ్రీలకు చేరో రూ. 1,00,116 విలువ గల చెక్కులు ఎమ్మెల్యే నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, డీటీ నరేశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గజ్జారాం, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు, నాయకులు జీవీ రమణ రావు, జక్కుల గజేందర్, రాజు, వెంగల్ రావు, మాజీ ఎంపీటీసీ సుధాకర్ పాల్గొన్నారు.

## రాజరాజేశ్వర ఆలయంలో పూజలు

కుంటాల, ఆగస్టు, 19 : సూర్యాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాత వాన్‌కార్ గంగారాంను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. నమస్తే తెలంగాణలో ప్రచురితమైన నిలిచిపోయిన కల్యాణ మండపం నిర్మాణ పనులు కథనానికి వర్షాలకు దెబ్బతిన్న ఆలయ రోడ్డును ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చేస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నాయకులు గజ్జారాం, ఆలయ కమిటీ చైర్మన్ పల్లె మహేశ్, రాజన్న, భోజన్న, సురేశ్, మహేశ్, మాజీ ఎంపీటీసీ రవి, ఆలయ సమితి సభ్యులు, గ్రామస్తుల పాల్గొన్నారు.

## బహుజన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్

ముథోల్, ఆగస్టు 19: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం ముథోల్‌లోని నయాబాది చౌరస్తా వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు భూమేశ్, పోతన్న యాదవ్, మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ కోసం దరఖాస్తుల వెల్లువ

బోథ్, ఆగస్టు 19 : రైతు రుణమాఫీ కోసం దరఖాస్తులు వెల్లువల వస్తున్నాయి. సోమవారం బోథ్‌లోని రైతువేదిక భవనంలో వ్యవసాయాధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ వర్తించని రైతులు వేదికకు వచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. ఏడు క్లస్టర్ల పరిధిలోని సుమారు 200 మంది వరకు రైతులు రుణమాఫీ విషయం తెలుసుకునేందుకు వేదికకు వచ్చారు. 51 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర, ఏఈవోలు వాజీద్, సంతోష్, శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణ, రాము, దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 19 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన దరఖాస్తులు ఇప్పటి వరకు పరిష్కరించినవి ఇంకా పరిష్కరించాల్సిన వాటి వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రుణాలు, మహిళా క్యాంటీన్లు, స్వచ్ఛదనం పచ్చదనం తదితర కార్యక్రమాల అమలుపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్, మెప్మా, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డెంగ్యూ కేసుల నియంత్రణపై చర్యలు చేపట్టాలి

ఎదులాపురం, ఆగస్టు 19 : ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డెంగ్యూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, మెప్మా సిబ్బందితో కలిసి అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో రోజురోజుకు పెరుగుతున్న డెంగ్యూ కేసుల నియంత్రణ చేసినందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా 49 వార్డుల్లో వైద్యారోగ్య శాఖ మున్సిపల్, మెప్మా సిబ్బంది అంతా కలిసి డ్రై డే నిర్వహించాలన్నారు. యాంటీ లార్వా, స్ప్రేయింగ్, విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో కృష్ణ, డీఎంవో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్స్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం


గొల్లమాడ వనిత

కుభీర్, ఆగస్టు 19 : కుభీర్‌కు చెందిన గొల్లమాడ వనిత(19) ఆదివారం అదృశ్యమైంది. కిరాణ కొట్టుకు వెళ్లొస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. చాణక్య ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తున్న టీచర్ అశ్వత్‌కుమార్ తన కూతురిని తీసుకెళ్లినట్లు స్పష్టమవుతోందని తండ్రి గొల్లమాడ రవి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

## దస్తురాబాద్ ఎస్ఐగా రాహుల్ గైక్వాడ్

దస్తురాబాద్,ఆగస్టు19 : దస్తురాబాద్ ఎస్ఐగా రాహుల్ గైక్వాడ్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండల ఎస్ఐగా పని చేసిన రాహుల్ గైక్వాడ్ బదిలీపై దస్తురాబాద్‌కు వచ్చాడు. రెండో సారి మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల ఎస్ఐగా విధులు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

## అన్నదాతను నట్టేట ముంచారు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగయ్య

భీంపూర్, ఆగస్టు 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అబద్ధాలతో అన్నదాతను నట్టేట ముంచిందని భీంపూర్ బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య అన్నారు. సోమవారం భీంపూర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్థం లేని షరతులతో కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగానే రుణమాఫీ చేస్తూ దానిని రణమాణిగా మార్చిందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పట్టుదలతో ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు నరేందర్‌యాదవ్, సంతోష్, అనిల్, లింబాజీ, బాదర్, జహూర్‌అహ్మద్, లస్మన్న, సంజీవ్‌రెడ్డి, రవీందర్, స్వామి, నితిన్ పాల్గొన్నారు.

## నాగోబా మురాడిలో మెస్రం వంశీయుల నోవోంగ్ పూజలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 19: కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా మురాడిలో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో నవధాన్యాలతో కూడిన నోవోంగ్ పూజలు నిర్వహించారు. సోమవారం ఉమ్మడి జిల్లాలోని మెస్రం వంశీయులు వ్యవసాయ భూముల్లో కొత్తగా పండించిన నవధాన్యాలతో కూడిన నైవేద్యాలను తయారు చేసి కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా మురాడికి తరలివచ్చారు. నాగోబా మురాడి వద్ద కటోడ కోసు, కటోడ హనుమంత్‌రావ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం వంశీయులు చిన్నుపటేల్, బాజీరావ్, లింబారావ్, గణపతి, తిరుపతి, నాగ్‌నాథ్, తుకారాం, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయాభివృద్ధికి కృషి

జైనథ్, ఆగస్టు 19 : పిప్పల్‌గావ్ హనుమాన్ ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు (ఎస్ఏ) లత రమాకాంత్ తెలిపారు. ఆలయాభివృద్ధిలో భాగంగా గోడ గడియారంతో హనుమాన్ చాలీసా పుస్తకాలు గ్రామస్తులకు అందజేసి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా నాయకులు పూసం ఆనంద్‌రావ్, గంగారాం, భాగవాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థిక సాయం

పెంబి, ఆగస్టు 19: పెంబికి చెందిన తక్కలపెల్లి రమేశ్ కూతురు వివాహం నిశ్చియమైంది. రమేశ్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో తన కూతురు వివాహానికి పదో తరగతి స్నేహితులు సోమవారం తన నివాసానికి వెళ్లి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తులాల శంకర్, రాజేందర్, కిరణ్, చిరంజీవి పాల్గొన్నారు.

## అడెల్లి పోచమ్మ ఆలయ దుకాణాల సముదాయాలకు టెండర్లు

సారంగాపూర్, ఆగస్టు 19: మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద వివిధ దుకాణాలు నడుపుకునేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు టెండర్లు నిర్వహించనున్నట్లు ఈవో బల్లు రమేశ్ తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుకు రూ. 5 లక్షలు, పుట్నాలు, ప్యాలాలు అమ్ముకునే హక్కుకు రూ. 75వేలు, బొమ్మలు, కంకణాలు, సీడీలు, ఫొటోలు అమ్ముకునే హక్కుకు రూ. 75వేలు, ఇతరములు అమ్ముకునే హక్కుకు రూ. 75వేలు, ఇడుపిడు పిల్ల, మేకలు సేకరించు హక్కుకు రూ. 50వేలు, టోల్‌ట్యాక్స్ వసూలు చేసుకునే హక్కుకు రూ. 3లక్షలు, పూలదండలు అమ్ముకునే హక్కుకు రూ. 75వేలు, తైబజార్ వసూలు హక్కుకు రూ. ఒక లక్ష చొప్పున డిపాజిట్ పెట్టి బహిరంగ వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.